క్లుప్తంగా

యుద్ధప్రాతిపదికన ధాన్యం కొనుగోళ్లు

గూడూరు: గూడూరు మండలంలో వరి కోతలు పూర్తి చేసిన రైతులు పలు ప్రాంతాల్లో రోడ్లపై ధాన్యం రాశులు పోసి ఆరబెట్టారు. తుపాను హెచ్చరికల నేపథ్యంలో ధాన్యం కొనుగోళ్లకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఆదివారం రామరాజుపాలెం అడ్డరోడ్డు వద్ద నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోళ్లను బందరు ఆర్డీఓ ఎం. వాణి సమీక్షించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. గూడూరు తహసీల్దార్ బి. విజయ ప్రసాద్ క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేస్తున్నారు. ధాన్యం మిల్లులకు తరలించేందుకు వాహనాలు ఏర్పాటు చేయడంతో పాటు మిల్లర్లతో మాట్లాడి కొనుగోళ్లు వేగవంతంగా చేయాలని చెప్పారు.

పింఛన్ల పంపిణీలో తృతీయ స్థానం



మచిలీపట్నంటౌన్: వైఎస్సార్ సామాజిక పింఛన్ల పంపిణీ మూడో రోజు ఆదివారం కొనసాగింది. మచిలీపట్నం నగరంలో 18,977 మంది పింఛనుదారులు ఉండగా 18,354 మందికి పింఛన్లను అందజేశారు. ఇంకా 623 మందికి పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉంది. ఆదివారం నాటికి 96.72 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేసి జిల్లాలో నగరం తృతీయ స్థానంలో నిలిచింది. పలు డివిజన్లలో వలంటీర్లు పింఛనుదారులకు పింఛను సొమ్మును అందజేశారు.

దుప్పట్లు, వంటపాత్రల పంపిణీ



మచిలీపట్నంటౌన్: మదర్ థెరిస్సా సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక జగన్నాథపురంలో సేవా సమితి ఆధ్వర్యంలో దివ్యాంగులకు దుప్పట్లు, చీరలు, వంటపాత్రలను పంపిణీ చేశారు. సుల్తానగరానికి చెందిన దివ్యాంగుడు పరసా ఈశ్వర్‌కుమార్ సివిల్ సర్వీసెస్‌కు ప్రిపేర్ అవుతుండటంతో పుస్తకాలు, ఆర్థిక సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో సమితి గౌరవాధ్యక్షుడు పైడిపాముల గురుప్రసాద్, ఎల్. బాలాజీ, మంగినపూడి విస్సఅవుట్ రిచ్ ఫౌండేషన్ చైర్మన్ దేవదాసు, సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల అందజేత



అవనిగడ్డ: టెన్త్, ఇంటర్, డిగ్రీలో మెరిట్ సాధించిన 47 మంది విద్యార్థులకు రాయల్ ట్రస్ట్ ద్వారా స్కాలర్‌షిప్‌లను అందజేశారు. బొండాడ ఇంజినీరింగ్ కంపెనీ ఆర్థిక సౌజన్యంతో స్థానిక ఏ1 మార్ట్ హాల్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో డీఎస్పీ పి. మురళీధర్ విద్యార్థులకు రూ. 3.59 లక్షల స్కాలర్‌షిప్‌లను పంపిణీ చేశారు. డీఎస్పీ మురళీధర్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమం వల్ల ప్రతిభ గల విద్యార్థులకు ప్రోత్సాహం లభిస్తుందన్నారు. బొండాడ ఇంజినీరింగ్ కంపెనీ ఎండీ బొండాడ రాఘవేంద్రరావు మాట్లాడుతూ తమ కంపెనీ ద్వారా చేపట్టిన పలు సేవా కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో రాయల్ ట్రస్ట్ చైర్మన్ పి. పుల్లయ్య, కార్యదర్శి గుండపు చంద్రశేఖర్, కోశాధికారి గాజుల రామారావు, బొండాడ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎన్నికల విధుల్లో అలసత్వం వద్దు

పెడన రిటర్నింగ్ అధికారి రాజ్యలక్ష్మి



గూడూరు: ఎన్నికల విధుల్లో అలసత్వం ప్రదర్శించవద్దని పెడన నియోజకవర్గ ఎన్నికల అధికారి కె. రాజ్యలక్ష్మి అన్నారు. గూడూరు మండలంలోని పోసినవారిపాలెం, చిట్టి గూడూరు గ్రామాల్లోని పోలింగ్ బూత్‌లను ఆదివారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని పరిశీలించి మాట్లాడారు. బూత్ పరిధిలోని అర్హులైన వారందరికీ ఓటు హక్కు కల్పించేలా బీఎల్వోలు చొరవ తీసుకోవాలన్నారు. బూత్ పరిధిలో మృతిచెందిన వారి పేర్ల తొలగింపులో ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు పాటించాలని చెప్పారు. వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి వాటిపై విచారణ చేసి వెంటనే నివేదిక సమర్పించాలని ఆదేశించారు. వై. శివశంకర్, ఆయా గ్రామాల వీఆర్వోలు, బీఎల్వోలు పాల్గొన్నారు.

ముంచుకొస్తున్న మిచాంగ్.. అన్నదాతల ఆందోళన

- కోడూరులో ఈదురు గాలులు.. చిరుజల్లులు
- పంట నేల వారుతుందని రైతుల ఆందోళన
- పలు ప్రాంతాల్లో యంత్రాల సాయంతో వరి కోతలు
- వరి కోతలు వద్దంటూ వ్యవసాయాధికారుల సూచనలు



కోడూరులో నూర్పిళ్లు చేసి ధాన్యాన్ని పోత పోస్తున్న కూలీలు



ఒర్లగొందితిప్ప వద్ద నిలిచిన బోట్లు



తీరం గేట్లను మూసి గస్తీ నిర్వహిస్తున్న మెరైన్, అటవీ, కోడూరు పోలీసులు



పాలకాయతిప్ప గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు



పెదగొల్లపాలెం బీచ్ వద్ద పెరిగిన అలల ఉధృతి

కోడూరు: మిచాంగ్ తుపాను ప్రభావంతో ఆదివారం వేకువజాము నుంచే ఆకాశం మేఘావృతమై చిరుజల్లులు కురిశాయి. మధ్యాహ్న సమయంలో ఓ మోస్తారు వర్షం కురవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈదురు గాలులు తీవ్రత కూడా అధికంగా ఉండడంతో వరి పంట నెలవారుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన వరి పంట చేతికొచ్చే సమయంలో తుపాను రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. ఇస్మాయిల్‌బేగ్‌పేట, మాచవరం, వి.కొత్తపాలెం, కృష్ణాపురం ప్రాంతాల్లో రైతులు యంత్రాల సహాయంతో హడావుడిగా వరికోతలు కోశారు. రైతులు వరికోతలు పూర్తి చేసి ఆరబెట్టిన ధాన్యాన్ని బస్తాల్లోకి ఎత్తి భద్రపర్చుకున్నారు. కూలీలతో కోతలు కోయించిన రైతులు వరి పనులను మెట్ట ప్రాంతాలకు తీసుకువచ్చి నూర్పిళ్లు చేశారు. తుపాను ప్రభావం తొలగే వరకు వరి కోతలు వద్దంటూ వ్యవసాయ అధికారులు రైతులకు అవగాహన కల్పించారు.

తీరం గేట్లు మూసివేత..

కోడూరు: తుపాను ప్రభావంతో హంసలదీవి సాగర తీరానికి పర్యాటకుల రాకపోకలను నిషేధిస్తూ పోలీసులు పాలకాయతిప్ప వద్ద తీరం గేట్లను మూసివేశారు. ఆదివారం సెలవు దినం కావడంతో పాటు కార్తికమాసం కూడా కలిసి రావడంతో సముద్ర స్నానాలు చేసేందుకు హైదరాబాద్, గుంటూరు, ఉభయ గోదావరి, విజయవాడ ప్రాంతాలకు చెందిన పర్యాటకులు పెద్దసంఖ్యలో తీరానికి వచ్చారు. సముద్ర స్థితిగతులు సరిగ్గా లేకపోవడంతో మెరైన్ పోలీసులు, అటవీ అధికారులు పర్యాటకులను పాలకాయతిప్ప కరకట్ట వద్దే అడ్డుకున్నారు. తీరానికి వెళ్లడానికి వీలు లేదని చెప్పారు. దీంతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన యాత్రికులు సాగరతీరానికి వెళ్లకుండా నిరాశతో వెనుదిరిగారు. సాగరతీరం గేట్ల వద్ద పాలకాయతిప్ప మెరైన్ సీఐ పవన్ కిషోర్, కోడూరు ఎస్ఐ రాజేంద్రప్రసాద్, అటవీ అధికారి సుధారాణి సిబ్బందితో కలిసి గస్తీ చేపట్టారు.

కృత్తివెన్ను: బంగాళాఖాతంలో ఏర్పడ్డ మిచాంగ్ తుపాను ప్రభావం మండలంపై ఉంటుందన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. కృత్తివెన్ను తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నారు. ఆదివారం ఉదయం తహసీల్దార్ రామకోటేశ్వరరావు, ఎంపీడీఓ పిచ్చిబాబు, ఫిషరీస్ ఏడీ నాగబాబులు తీర గ్రామాలైన చినగొల్లపాలెం, ఒర్లగొందితిప్ప, పోడు, పడతడిక గ్రామాలలో పర్యటించి పరిస్థితిని సమీక్షించారు. ప్రభుత్వం నుండి ఆదేశాలు వచ్చేవరకు మత్స్యకారులెవరూ చేపల వేటకు వెళ్లరాదని సూచించారు.

పునరావాస కేంద్రాల ఏర్పాటు

కోడూరు: తుపాను హెచ్చరికల నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. మండలంలో సముద్ర తీరానికి ఆనుకొని ఉన్న గ్రామాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. పాలకాయతిప్ప, హంసలదీవి, ఊటగుండం, రామకృష్ణాపురం, బసవానిపాలెం, చింతకోళ్ల, జార్జిపేట గ్రామాలపై తుపాను ప్రభావం తీవ్రంగా ఉంటుందనే హెచ్చరికలతో ఈ గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెట్టారు. తహసీల్దార్ షేక్ లతీఫ్‌పాషా, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎస్ఐ రాజేంద్రప్రసాద్‌ల పర్యవేక్షణలో అన్ని శాఖల అధికారులు తీర ప్రాంత గ్రామాల్లో ఉంటూ అక్కడి పరిస్థితులను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు నివేదిస్తున్నారు. అధికారులు ఆయా గ్రామాల్లో పర్యటించి గ్రామస్తులకు ధైర్యం చెప్పారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో ఆరు పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామని తహసీల్దార్ తెలిపారు. పాలకాయతిప్పలో రెండు ఊటగుండం, బసవానిపాలెం, జార్జిపేట గ్రామాల్లో ఒక్కో పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు. పరిస్థితిని బట్టి గ్రామస్తులను ఈ కేంద్రాలకు పంపనున్నట్లు తహసీల్దార్ తెలిపారు. వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అలజడి..ఆందోళన

కృత్తివెన్ను: తుపాను ప్రభావంతో సముద్రంలో అలజడి నెలకొంది. కృత్తివెన్ను మండలంలోని పెదగొల్లపాలెం, చినగొల్లపాలెం, ఇంతేరు బీచ్‌లలో యాత్రికులను సందర్శనకు అనుమతించలేదు. తీరం వెంబడి తీవ్రమైన గాలులతో పాటు అలల తీవ్రత పెరిగింది. వ్యవసాయ పనుల నేపథ్యంలో రైతులు తమ పంటను కాపాడుకునేందుకు ఉరుకులు పరుగులు పెడుతున్నారు. మత్స్యకారులు వేటకు వెళ్లకుండా తమ బోట్లను సురక్షిత ప్రాంతాల్లో నిలిపివేశారు.

ఒడ్డుకు చేరిన వేట పడవలు

కోడూరు: తుపాను హెచ్చరికల నేపథ్యంలో మత్స్యకారులు తమ వేట పడవలను ఒడ్డుకు చేర్చుకున్నారు. నాలుగు రోజుల పాటు గంగపుత్రులను వేటకు వెళ్లవద్దని అధికారులు ఆదేశాలు జారీ చేయడంతో పాలకాయతిప్ప సముద్ర శింకు వద్ద పడవలను లంగర్లతో కట్టి, వలలను భద్రపరుచుకున్నారు. పలువురు మత్స్యకారులు పడవలకు మరమ్మతులు చేసుకుంటూ, మరికొంతమంది కొత్త వలలు అల్లుకుంటూ కనిపించారు.

ముందస్తు జాగ్రత్త చర్యలు

మోపిదేవి: తుపాను హెచ్చరికల నేపథ్యంలో మండలంలో ఎలాంటి ప్రమాదాలు జరుగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకున్నామని తహసీల్దార్ కె. నవీన్‌కుమార్ ఆదివారం తెలిపారు. కంట్రోల్ రూం ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు ప్రజలకు, రైతులకు ముఖ్యమైన సూచనలు చేస్తున్నామన్నారు. వీఆర్వోలను ఆయా గ్రామాల్లోనే ఉండాలని ఆదేశించామని చెప్పారు. ఎమర్జెన్సీ కింద కె. కొత్తపాలెం, కొక్కిలిగడ్డ, మోపిదేవిలో మూడు చోట్ల వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. రైతులు తమ పంటను భద్రపరుచుకునేలా చర్యలు తీసుకున్నామని, ఇప్పటికే నూర్పిళ్లు జరిగిన పంటను త్వరితగతిన మిల్లులకు తరలించామని, పనలమీద ఉన్న పంట కుప్పలు వేసుకునేలా చేస్తూ, కోయని పంటను వాయిదా వేసుకోవాలని సూచించారు. ఎప్పటికప్పుడు గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నామని చెప్పారు. ఎంఆర్ఐ సునీల్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ మోపిదేవి శ్రీనివాసరావు, వీఆర్వోలు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

ఆనందోత్సాహాలతో వనసమారాధనలు

మచిలీపట్నంటౌన్: కార్తిక వనసమారాధనలు పలు సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం నగరంలో ఆనందోత్సాహాలతో జరిగాయి. ఆయా సంఘాల ప్రతినిధులు కుటుంబాలతో సమారాధన కార్యక్రమంలో పాల్గొని చిన్నారులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. సత్యనారాయణస్వామి వ్రతాలను నిర్వహించి చిన్నారులు, పెద్దలు కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. మచిలీపట్నం వడ్రంగి పనివారల సంఘం ఆధ్వర్యంలో స్థానిక రామలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో సమారాధన జరిగింది. నగరంలోని హౌసింగ్ బోర్డు వైఎస్సార్ పార్కులో ఫొటోగ్రాఫర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కార్తిక వనసమారాధన నిర్వహించారు. కార్యక్రమానికి నగర మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) హాజరయ్యారు. గొడుగుపేట శంకరమఠంలో బ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కార్తిక వనసమారాధనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు లలితా సహస్రనామ పారాయణం చేశారు. బ్రాహ్మణ ప్రముఖులను సన్మానించారు.

- నడకుదురు(చల్లపల్లి): నడకుదురులోని పృథ్వీశ్వరస్వామి వారి దేవస్థానం భక్తులతో కిటకిటలాడింది. ఆదివారం ఆలయానికి భక్తులు వేలాదిగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారికి మహా రుద్రాభిషేకం, పంచామృత అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలోని పాటలీ వృక్షాన్ని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం చెంతనే ఉన్న కార్తిక వనం ఉసిరితోటలో ఉసిరి చెట్లకు పూజలు చేశారు. ఉసిరి, కదంబ వృక్షాల కింద వన భోజనాలు చేశారు. నాదెళ్లవారిపాలెం పృథ్వీశ్వర భక్త సమాజం, ఎస్సార్‌వైఎస్సీ జూనియర్ కళాశాల (1987–2020) బ్యాచ్ పూర్వ విద్యార్థులు, అవనిగడ్డ ఆర్యవైశ్య కుటుంబాల వారు వేలాదిగా తరలివచ్చి వన భోజనాలు చేశారు. పిల్లలు ఆట పాటలతో సందడి చేశారు.
- బంటుమిల్లి: బంటుమిల్లిలో కాపు కార్తిక వన సమారాధన ఆదివారం నిర్వహించారు. మాజీ ఎంపీపీ శంకరరావు గృహం వద్ద ఏర్పాటు చేసిన పూజ కార్యక్రమాల్లో పలువురు దంపతులు పాల్గొని సత్యనారాయణ వ్రతాలు, ఉసిరి చెట్టుకు పూజలు చేశారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, టీడీపీ నాయకులు బూరగడ్డ వేదవ్యాస్, కాగిత కృష్ణప్రసాద్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు సుజ్ఞానం మహేష్, సర్పంచ్ సుజ్ఞానం కృష్ణవేణి పాల్గొన్నారు.



బంటుమిల్లిలో పూజలు చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ హారిక



నడకుదురులో వన భోజనాలు చేస్తున్న భక్తులు



వనసమారాధనలో భాగంగా శంకరమఠంలో పారాయణం చేస్తున్న మహిళలు

ఆఫ్‌లైన్‌లో ధాన్యం తోలకాలపై రైతుల హర్షం



ఆముదాలపల్లిలో ధాన్యాన్ని బస్తాలకు ఎత్తుతున్న రైతులు

బంటుమిల్లి: తుపాను ప్రభావంతో రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని ఆఫ్‌లైన్‌లో యుద్ధప్రాతిపదికన తరలించాలని ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో గత కొన్ని రోజులుగా సార్వా కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. తుపాను హెచ్చరికల నేపథ్యంలో వ్యవసాయాధికారులు గ్రామాల్లో పర్యటించి కోతలు నిలిపివేయాలని సూచించారు. ఇప్పటివరకు కోతలు పూర్తి చేసిన రైతులు కళ్లాల్లో ఉన్న ధాన్యాన్ని మిల్లర్ల వద్దకు చేర్చేందుకు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం ఆర్‌బీకేల వద్ద సంచులను సిద్ధంగా ఉంచడంతో రైతులు తమ పేర్లను నమోదు చేసుకుని సంచులు తీసుకువెళుతున్నారు. ధాన్యం బస్తాలను ఆర్‌బీకే వద్దకు తీసుకువస్తున్న రైతులు ప్రభుత్వ ఆదేశాలతో పడిగాపులు పడకుండా ట్రిప్‌షీట్లు తీసుకుని వారికి నచ్చిన మిల్లులకు ధాన్యాన్ని తరలిస్తున్నారు. శనివారం వరకు ఆన్‌లైన్‌లో ఇబ్బందులు పడ్డామని, ఆదివారం ప్రభుత్వం స్పందించి ఆఫ్‌లైన్‌కు మార్చడంతో పెద్ద సమస్య పరిష్కారమైందని పలు గ్రామాల రైతులు సంతోషం వ్యక్తం చేశారు. దీనిపై తహసీల్దార్ ఎంవీ సత్యన్నారాయణ, వ్యవసాయశాఖాధికారి శివరామకృష్ణలు మాట్లాడుతూ కళ్లాల్లో ఉన్న ధాన్యం మిల్లులకు తరలించేందుకు రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నామన్నారు. అన్ని ఆర్‌బీకేల వద్ద గోనె సంచులు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. ఎప్పటికప్పుడు గ్రామాల్లో పరిస్థితులను సమీక్షిస్తూ సంచులు ఇవ్వడంతో పాటు, బస్తాలు వెంటనే దిగుమతి అయ్యే విధంగా చూస్తున్నామన్నారు. తుపాను తీరం దాటి వాతావరణం మామూలు స్థితికి వచ్చేవరకు కోతలు కోయవద్దని రైతులకు సూచించారు.

సామూహిక సత్యదేవుని వ్రతాలు



సత్యదేవుని వత్రాల్లో పాల్గొన్న దంపతులు, భక్తులు

కోడూరు: కార్తిక మాసాన్ని పురస్కరించుకొని కోడూరు షిర్డీ సాయి దివ్యజ్ఞాన ధాన్య మందిరంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలను ఆదివారం కనుల పండువగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఊసిరిచెట్టు కింద వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ సత్యదేవుని వ్రతాలను జరిపారు. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు వ్రతాల్లో పాల్గొన్నారు. ప్రధాన అర్చకుడు సత్యనారాయణ పర్యవేక్షణలో మహాశివునికి రుద్రాభిషేకాలు నిర్వహించారు. సాయిబాబా ఉత్సవమూర్తికి పంచామృతాభిషేకాలు, పల్లకి సేవ జరిపారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన జరిగింది. భక్తమండళ్ల సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన అఖండ సాయినామ సంకీర్తనకు ముగింపు పలికి, ప్రత్యేక హారతులిచ్చారు. కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మత్స్యకారులూ.. చేపల వేటకు వెళ్లవద్దు

మత్స్యశాఖ జేడీ శ్రీనివాసరావు



మత్స్యకారులకు సూచనలు చేస్తున్న జేడీ

నాగాయలంక: తుపాను ప్రభావం దృష్ట్యా తీరం ప్రాంతంలోని మత్స్యకారులు ఎట్టి పరిస్థితుల్లోనూ సముద్రంలో చేపల వేటకు వెళ్లవద్దని మత్స్యశాఖ జేడీ ఎస్. శ్రీనివాసరావు అన్నారు. తుపాను హెచ్చరికల నేపథ్యంలో ఆయన సిబ్బందితో కలిసి ఏటిమొగ, గుల్లలమోద, సొర్లగొంది, నాగాయలంక ఫిష్ ల్యాండింగ్ సెంటర్లను సందర్శించారు. మత్స్యకారులతో ఆయన మాట్లాడుతూ పడవలు ఒకదానితో ఒకటి ఢీ కొట్టుకోకుండా టైర్లతో కట్టుకోవాలని, వలలు జాగ్రత్తగా ఒడ్డుకు చేర్చుకోవాలని సూచించారు. చెరువులలోని చేపలు, రొయ్యలు మార్కెట్ సైజుకు పెరిగితే తుపానుకు ముందుగానే పట్టుబడి చేయాలని ఆక్వా రైతులకు సూచించారు. చేపలు, రొయ్యల సీడ్ ముందుస్తుగా స్టాక్ చేయాలని నిర్ణయించుకున్న ఆక్వా రైతులు వాయిదా వేసుకుని తుపాను తర్వాత స్టాకింగ్ పనులు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అవనిగడ్డ మత్స్యశాఖ ఏడీఎఫ్ ఆర్.ప్రతిభ, ఎఫ్‌డీఓలు టి.సునీత (అవనిగడ్డ), ఎం.రవికుమార్ (నందివాడ), వీఎఫ్ఏలు, సిబ్బంది పాల్గొన్నారు.

కంట్రోల్ రూం ఏర్పాటు..

ప్రజలు, రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకుని అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ జె.విమల కుమారి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అత్యవసరమైతే తక్షణం తహసీల్దార్ కార్యాలయంలోని కంట్రోల్ రూంను సంప్రదించాలన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

కృత్తివెన్ను: మండల పరిధి కొమాళ్లపూడి పంచాయతీలో సోమవారం ఉదయం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని మంత్రి కార్యాలయం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ పాల్గొని ప్రతి ఇంటిని సందర్శిస్తారని పేర్కొన్నారు. అధికారులు, నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది హాజరుకావాలని పేర్కొన్నారు.

ఆర్థిక సాయం

గూడూరు: మల్లవోలు శివారు ముదిరాజ్‌పాలెంకు చెందిన పిండి మంగమ్మ మట్టి ఖర్చులకు హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ఆధ్వర్యంలో రూ. 5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. మంగమ్మ అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మృతిచెందింది. మానవ హక్కుల సంఘం యూత్ కన్వీనర్ పడవల మోహన్ త్రినాథ్ ఆధ్వర్యంలో మృతురాలి కుటుంబ సభ్యులకు సాయం అందజేశారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప పడిపూజ

బంటుమిల్లి: గ్రామంలో అయ్యప్ప పడిపూజ ఆదివారం రాత్రి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక వినాయకుడి గుడి నుంచి అయ్యప్పలు, భవానీలు గ్రామోత్సవం నిర్వహించారు. ఆర్యవైశ్య మహిళా సంఘ సభ్యులు చేసిన కోలాటం ఆకట్టుకుంది.

120 మందికి నేత్ర వైద్య పరీక్షలు



నేత్ర పరీక్షలు చేస్తున్న వైద్యులు

నాగాయలంక: జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శంకర కంటి ఆస్పత్రి (పెదకాకాని) సహకారంతో స్థానిక సుదర్శి మానవతా సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. తలశిల నాగేశ్వరరావు, భారతి జ్ఞాపకార్థం వారి కుమార్తె పద్మామణి, ఎంఎస్ చౌదరి, సురేష్ (హైదరాబాద్) ఆర్థిక సహకారంతో స్థానిక మారుతీ విద్యా నికేతన్ ప్రాంగణంలో జరిగిన శిబిరాన్ని దాతల ప్రతినిధి తలశిల నవీన్ శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరంలో 120 మందికి పరీక్షలు చేయగా 102 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. వీరిని శస్త్రచికిత్సలకై బస్సులో పెదకాకాని ఆస్పత్రికి తరలించామని సంస్థ అధ్యక్షుడు తలశిల రఘుశేఖర్ తెలిపారు. డాక్టర్ బిపిన్, డాక్టర్ ఆకాంక్ష వైద్య సేవలు అందించారు. ఆస్పత్రి క్యాంప్ ఇన్‌చార్జి నాగబాబు, జమీలా మస్తాన్, కనిగంటి వెంకట నారాయణ, మత్తి శివ పాల్గొన్నారు.

ప్రత్యేక శిబిరాలకు 762 దరఖాస్తులు



పెడన 11వ వార్డులోని పోలింగ్ కేంద్రంలో ఓటరు జాబితాను సరి చూసుకుంటున్న ఓటర్లు

పెడన: పెడన నియోజకవర్గంలోని 216 పోలింగ్ స్టేషన్లలో ఓటర్ల నమోదుకు ప్రత్యేక శిబిరాలను శని, ఆదివారాల్లో నిర్వహించారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఈ రెండు రోజుల్లో 762 దరఖాస్తులు వచ్చాయి. వీటిల్లో ఫారం–6కు సంబంధించి కొత్తగా ఓటు నమోదు చేసుకునేందుకు 514, తొలగింపునకు ఫారం–7కు 75, ఫారం–8 మార్పులు చేసుకునేందుకు 173 దరఖాస్తులు వచ్చాయి. గూడూరు మండలంలో మొత్తం 110, పెడన రూరల్‌లో 143 మంది, పెడన అర్బన్‌లో 186 మంది, బంటుమిల్లిలో 167 మంది, కృత్తివెన్నులో 156 మంది దరఖాస్తు చేసుకున్నారని, దరఖాస్తులను విచారణ చేసి ఈనెల 20వ తేదీలోగా పరిష్కరిస్తామని నియోజకవర్గ ఎన్నికల అధికారి కె. రాజ్యలక్ష్మి తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో 2024 జనవరి 5న ఓటర్ల తుది జాబితా వెలువడుతుందని చెప్పారు.

స్వామివారి ఆలయంలో భక్తుల రద్దీ



మోపిదేవి: స్థానిక వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి ఆలయం ఆదివారం భకులతో కోలాహలంగా మారింది. తెలుగు రాష్ట్రాలతో పాటు సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కళకళలాడింది. నాగపుట్ట, నాగమల్లి వృక్షం, పొంగళ్లశాల వద్ద భక్తుల రద్దీ కనిపించింది. ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు ఆధ్వర్యంలో ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ట్రాఫిక్‌తో ప్రయాణికుల ఇబ్బందులు

మోపిదేవి: మోపిదేవి ప్రధాన గుడి సెంటర్ వద్ద ఆదివారం ట్రాఫిక్ రద్దీ ఏర్పడింది. గుడి ఎదురుగా గల రోడ్డులో ఊకలోడు ట్రాక్టర్ 214 జాతీయ రహదారి పెదప్రోలు వైపు రోడ్డు పక్కన ఏర్పాటుచేసిన హోర్డింగ్‌ను కొట్టింది. దాని వెనుకవైపు వాహనాలు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. దీనితో ట్రాఫిక్ రద్దీ ఏర్పడింది. ప్రతి ఆదివారం మోపిదేవి సెంటర్‌లో ట్రాఫిక్ రద్దీ ఏర్పడటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అధికారులు స్పందించి ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

అర్చకుడి గృహానికి దాతల సహకారం

పెదప్రోలు(మోపిదేవి): పెదప్రోలు గ్రామంలోని భూనీల సమేత చెన్నకేశవ, ఖడ్గాంజనేయ స్వామి వారి ఆలయం అర్చకుడి నివాస భవనానికి దాత కూరపాటి కోటేశ్వరరావు, ఉమాదేవి దంపతులు శంకుస్థాపన చేశారు. స్థానిక పీఏసీఎస్ చైర్‌పర్సన్ ఆది రాంబాబు మాట్లాడుతూ దాత కోటేశ్వరరావు రూ. 20 లక్షలతో అర్చకుని నివాసం ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ జన్యావుల రామమోహనరావు, సీనియర్ నాయకులు ఆకుల వెంకట్రామయ్య పాల్గొన్నారు.